యూపీహెచ్‌సీ స్థల పరిశీలన

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో సర్వే నం. 343లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (యూపీహెచ్‌సీ) కేటాయించిన స్థలాన్ని చైర్‌పర్సన్ కౌకుట్ల చంద్రారెడ్డి, డీఎంహెచ్‌వో రఘునాథమ్‌తో కలిసి పరిశీలించారు. వారితో వైస్ చైర్‌పర్సన్ బండారి మల్లేశ్ యాదవ్, కమిషనర్ రాజేందర్ కుమార్, డీఈఈ సుదర్శనం, ఏడీ రఘు ఉన్నారు.

- మేడ్చల్, ఫిబ్రవరి 6

వైద్య శిబిరానికి స్పందన

మల్కాజిగిరి, ఫిబ్రవరి 6 మౌలాలి డివిజన్‌లోని షఫీ నగర్‌లో మర్రి రాజశేఖర్ రెడ్డి ఫౌండేషన్ అరుంధతి హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. కార్యక్రమం లో మహ్మద్ ఇబ్రహీం అలీ, సాధిక్, హయాత్, సద్దాం పాల్గొన్నారు.

సమ్మెకు సహకరించాలి

చర్లపల్లి, ఫిబ్రవరి 6 : ఈ నెల 16న నిర్వహిస్తున్న కార్మికుల దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌కు సహకరించాలని కోరుతూ డీసీ ముకుంద్‌రెడ్డిని బీఆర్‌టీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బీఆర్‌టీయూ కాప్రా అధ్యక్షుడు కురుమన్న, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు మిరియాల సాయిలు, కాప్రా అధ్యక్షుడు జాను, ఐఎఫ్‌టీయూ నాయకుడు శివ బాబు మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు.

ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే ఉపేక్షించం

- అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి
- అధికారుల సమీక్షా సమావేశంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డీసీ, కార్పొరేటర్లు

కాప్రా, ఫిబ్రవరి 6: ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసేవారిని ఉపేక్షించవద్దని, కాప్రా చెరువు చుట్టూ జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కాప్రా సర్కిల్ అధికారులకు సూచించారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్, ఎలక్ట్రిసిటీ, యూసీడీ, ఎంటమాలజీ విభాగాల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను మనస్ఫూర్తిగా అభివృద్ధి కోరుకునే వాడినని, అందరి సహకారంతో కాప్రా సర్కిల్‌లో సంపూర్ణ అభివృద్ధిని సాధిద్దామన్నారు. కాప్రా చెరువు చుట్టూ జరుగుతున్న నిర్మాణాలను సక్రమమేనా అని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. కాప్రా చెరువును రక్షించుకుందామన్నారు. అలాగే చిన్న స్థలాల్లో గూడు నిర్మించుకునే పేదలను ఇబ్బంది పెట్టొందన్నారు. పెద్ద హోటళ్లు ఎలాంటి పార్కింగ్ లేకుండానే కొనసాగడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయని, వాటిని అధికారులు గుర్తించాలని, పార్కింగ్ ఉంటేనే అనుమతులు ఇవ్వాలన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఫోన్లుంస్విచ్ఛాఫ్ పెట్టొద్దని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడి అన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో పనుల వేగం పెంచాలనీ, సతాయించే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో నీటిఎద్దడి రాకుండా జల మండలి అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడేందుకు వెటర్నరీ విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డీసీ ముకుందరెడ్డి మాట్లాడుతూ.. జమ్మిగడ్డలో ఇటీవల 8 ఎకరాల ప్రభుత్వ స్థలం కబ్జా నుంచి రక్షించామన్నారు. సాకేత్‌లో ఓ వ్యక్తి ఫాబ్రికేటెడ్ డాక్యుమెంట్స్‌తో కబ్జా యత్నం చేస్తున్నాడని, దానిపై కోర్టులో కేసు నడుస్తోందని, బండబావి వద్ద ఇండోర్ స్టేడియానికి నిధులు మంజూరు జరుగాల్సి ఉందన్నారు. చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్, మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ తమ డివిజన్లలో పనులను త్వరితగతిన చేపట్టేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ హరిలాల్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ గిరిరాజ్, ఏఎంఓహెచ్ డా. వెంకటరమణ, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవిశ్వాసంపై మేము సంతకాలు చేయలేదు

శామీర్‌పేట, ఫిబ్రవరి 6 : తూంకుంట మున్సిపాలిటీ పాలకవర్గంలో కొత్త అలజడి మొదలైంది. ఇరువర్గాల ఫిర్యాదులతో అవిశ్వాస నాటకం తెరపైకి వచ్చింది. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెడుతూ దరఖాస్తు అందగా మేము అవిశ్వాసం కోసం సంతకాలు చేయలేదని కౌన్సిలర్లు కలెక్టరేట్, మున్సిపాలిటీ కమిషనర్‌కు కౌన్సిలర్లు వినతులు అందజేశారు. తూంకుంట మున్సిపాలిటీ పాలకవర్గంలోని కొందరు మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఇందుకు మెజార్టీ సభ్యుల వద్ద సంతకాలను సేకరించారు. 1వ వార్డు కౌన్సిలర్ పూజభరత్ సింగ్, 9వ వార్డు కౌన్సిలర్ సురేశ్, 14వ వార్డు కౌన్సిలర్ ఉమ ఆంజనేయులు అవిశ్వాసం విషయంలో తమకు తప్పుడు సమాచారం ఇచ్చి సంతకాలు చేయించుకున్నారని, అవిశ్వాసానికి తమకు సంబంధం లేదన్నారు. మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్, తూంకుంట మున్సిపాలిటీ కమిషనర్ జేతూరామ్ నాయక్‌కు వినతి పత్రాలు అందజేశారు. అభివృద్ధికి ప్రణాళిక రూపొందిందామని ఫోన్‌లో మాట్లాడి సంతకాలు తీసుకుని అవిశ్వాసం పెట్టారని ఆరోపించారు. అవిశ్వాసంపై మేము ఎలాంటి సంతకాలు చేయలేదని, అవిశ్వాసానికి తమకు సంబంధం లేదని తెలిపారు.

తూంకుంట మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ సురేశ్

అయోధ్య రామాలయం ప్రతిమ, ప్రసాదాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి మంగళవారం కాలనీవాసులు అందజేశారు కార్యక్రమంలో నాయకులు కృష్ణమాచారి, సారయ్య పాల్గొన్నారు. **- ఉప్పల్, ఫిబ్రవరి 6**

కాలనీ సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న వాణీనగర్ కాలనీవాసులు

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 6 : గౌతంనగర్ డివిజన్ వాణీనగర్ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కాలనీ వాసులు మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యేను తన కార్యాలయంలో కలిసి సీసీ రోడ్డు, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలనీవాసులు సిద్ధయ్య, బలరాం, నర్సింగరావు, రఘునాథ్, కామేశ్వర్‌రావు, ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

భువనగిరిలో విద్యార్థి వసతి గృహాల్లో విద్యార్థినుల ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణముంటూ ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం రామంతాపూర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎల్‌బీనగర్ విభాగ్ కన్వీనర్ శ్యామ్ కిరణ్ మాట్లాడుతూ.. భువనగిరిలో విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం సిగ్గు చేటన్నారు. **- రామంతాపూర్**

నేడు విద్యుత్ కోతలు

శామీర్‌పేట, ఫిబ్రవరి 6 : 33-11కేవీ లక్ష్మాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ ఐడీఏ లక్ష్మాపూర్, 11కేవీ ఎంసి పల్లి వ్యవసాయ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అలియాబాద్ విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూడు చింతలపల్లి, పోతారం, గ్రామాలు, పరిశ్రమలు, వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

హిందీలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

పోటీల్లో పాల్గొన్న సిబ్బందితో సీఆర్‌పీఎఫ్ డీఐజీ జీసీ అనిల్‌మింజ్

జవహర్‌నగర్, ఫిబ్రవరి 6: ప్రతి ఒక్కరూ హిందీలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సీఆర్‌పీఎఫ్ డీఐజీ జీసీ అనిల్‌మింజ్ అన్నారు. మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని సీఆర్‌పీఎఫ్ ప్రాంగణంలో అధికార భాష కమిటీ ఆధ్వర్యంలో 'ఇండియా క్వశ్చన్ ఫోరమ్ కాంపిటీషన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఐజీ జీసీ అనిల్‌మింజ్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందీని అర్థం చేసుకుంటే సులువని, ఉత్తర ప్రత్యుత్తరాలు నైపుణ్యంతో రాయాలని సూచించారు. ఈ మేరకు క్వశ్చన్ ఫోరం పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపించిన అధికారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌కుమార్ అసిస్టెంట్ జీసీ, రాజేష్‌కుమార్, శ్యామ్‌సుందర్ సాహు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా

నాచారం, హబ్సిగూడ ప్రాంతంలోని బచ్‌పన్-అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి తమవంతు కృషిచేస్తున్నామని తెలిపారు. క్రమశిక్షణ, నైపుణ్యం, సాంకేతికతను అందించేవిధంగా ప్రత్యేక ప్రణాళికతో ముందుకుసాగుతున్నామని తెలిపారు. స్కూల్ డైరెక్టర్ శివ్‌కుమార్ చిల్కా, కల్పన చిల్కా పాల్గొన్నారు. **- ఉప్పల్, ఫిబ్రవరి 6**

గుర్రపు డెక్క తొలగింపు

మల్కాజిగిరి, ఫిబ్రవరి 6: దోమల నివారణ కోసం గుర్రపు డెక్కను తొలగిస్తున్నామని అల్కాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం కొత్త చెరువులోని గుర్రపు డెక్క తొగలింపును కార్పొరేటర్ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ అధికారి రాజు, మల్లేశ్ గౌడ్, వీఎన్ రాజు, సంజీవరెడ్డి, రహమత్, హన్మంత్, మహేష్, అలీ, ఆరీఫ్, రమేష్, అరుణ్, ప్రేమ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో స్వాతి

జవహర్‌నగర్, ఫిబ్రవరి 6 : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, గర్భిణులు, చిన్నారులు ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఐసీడీఎస్ సీడీపీవో స్వాతి సూచించారు. మంగళవారం కార్పొరేషన్‌లోని గబ్బిలాల్‌పేట్, రాజీవ్‌గాంధీ నగర్, శాంతినగర్ బస్తీల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రై సంస్థ సహకారంతో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ.. ప్రతి మహిళా గర్భం దాల్చిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలని, ప్రభుత్వం అందించే బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రై సంస్థ సిబ్బంది మంజుల, సునీల్, సందీప్, అంగన్‌వాడీ టీచర్, క్రాంతి కళాబృందం వెంకటచారి, ఆంజనేయులు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులను వ్యతిరేకిస్తూ నిరసన

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 6 : తనపై అధికార పార్టీ నాయకులు అక్రమంగా కేసులు పెట్టిస్తున్నారని నిరసిస్తూ, స్థానిక బీజేపీ నాయకుడు ఘట్‌కేసర్‌లో మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ బొక్కొనిగూడకు చెందిన మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీ, స్థానిక కౌన్సిలర్ భర్త పోలీసులతో కుమ్మకై తన పై అక్రమంగా కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించాడు. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ భర్త చేస్తున్న అక్రమాలకు అడ్డు తగులడంతోనే తన పై పోలీసులు తప్పుడు కేసులు పట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని బాధితుడు మహిపాల్‌రెడ్డి పోలీసులకు తెలిపాడు. ఆయనకు బీజేపీ నాయకులు నర్సింహారెడ్డి,కొమ్మిడి దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీ కొమ్మిడి శోభారాణి, ఘట్‌కేసర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు హన్‌మాన్ మద్దతుగా నిలిచారు. స్టేషన్‌కు తరలించి అరెస్టు చేసినట్లు సీఐ గోవర్ధనగిరి తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత

ఘట్‌కేసర్‌లోని ఓ పేద కుటుంబానికి సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సహాయం అందజేసింది. భర్త అకాల మరణం కారణంగా ఇద్దరు ఆడపిల్లలతో అనాథగా మారి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళకు ట్రస్టు సభ్యులు రూ.10వేల చెక్కును అందజేశారు. ఘట్‌కేసర్‌లోని బ్రూక్‌బాండ్ కాలనీకి చెందిన కిశోర్‌లాల్ ఇటీవల అకస్మాత్తుగా మరణించాడు. విషయం తెలుసుకున్న ట్రస్టు సభ్యులు సుందర్‌రావు, శ్రీకాంత్, దేవానంద్, సోమయ్య, అనిల్‌సింగ్, వీరారెడ్డి, బంగారుబాబు ఈ చెక్కును అందజేశారు.

- ఘట్‌కేసర్, ఫిబ్రవరి 6

అక్రమ నిర్మాణాల కూల్చివేత

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 6: పోచారం మున్సిపాలిటీ, ఘట్‌కేసర్ మండల పరిధిలోని గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను రెవెన్యూ, పోలీసు అధికారులు మంగళవారం తెల్లవారుజామున కూల్చివేశారు. కీసర ఇన్‌చార్జి తహసీల్దార్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డి, ఆర్ఐ శ్రీరాం సిబ్బంది, పోలీసులతో కలిసి కూల్చివేతలను చేపట్టారు. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ సర్వే నం.3 బై 1లోని స్థలంలో 21, ఘట్‌కేసర్ మండలం ఘనాపూర్ పరిధిలో సర్వే నం.1107 స్థలంలోని 9 అక్రమ కట్టడాలను తొలగించినట్లు అధికారులు ప్రకటించారు.

నకిలీ టీ పొడి తయారు చేస్తున్న ఇద్దరు అరెస్టు

మల్కాజిగిరి, ఫిబ్రవరి 6: నకిలీ టీ పొడి తయారు చేస్తున్న ఇద్దరిని అల్వాల్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన పరీశ్, బాలానగర్‌కు చెందిన పద్మ అల్వాల్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. నకిలీ టీ పొడిని తయారు చేసి స్థానిక టీ డబ్బాలకు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు.. ఆ ఇంటిపై దాడి చేశారు. రెండు క్వింటాళ్ల టీ పొడిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని అల్వాల్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మెడికల్ షాపు సీజ్

రామంతాపూర్, ఫిబ్రవరి 6 : శారదానగర్ ప్రాంతంలో మంగళవారం తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మందులను స్టోర్ చేసిన మెడికల్ షాపులను వారు సీజ్ చేశారు.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

ప్రత్యేక అధికారుల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ గౌతమ్

మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): ప్రత్యేక అధికారులు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ .. ప్రత్యేక అధికారులు బాధ్యతలను పూర్తిగా అవగాహన చేసుకుని విధులు నిర్వర్తించాలని సూచించారు. సర్పంచుల పదవీ కాలం ముగిసినందున ప్రభుత్వ ఆదేశాల మేరకు 61 గ్రామ పంచాయతీలకు జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులను నియమించడం జరిగిందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పనులు జరిగేలా పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు. అధికారులు ప్రతి రెండు నెలలకు జరిగే గ్రామపంచాయతీ సభలకు హాజరై ఆదాయ, వ్యయాలపై సమీక్షించాలని, వంద శాతం ఇంటి పన్ను వసూళ్లు జరిగేలా చూడాలన్నారు. మేడ్చల్ జిల్లా హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్నందున అభివృద్ధి పనులపై దృష్టి సారించాలన్నారు. లే అవుట్లను పరిశీలించి తప్పని సరిగా లే అవుట్లలో పది శాతం గ్రామ పంచాయతీలకు చెందేలా చూడాలని పేర్కొన్నారు. నిబంధనల మేరకే భవనాలకు అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. నీటి సరఫరా, పారిశుధ్యం, గ్రీవెన్స్, ట్యాక్స్ కలెక్షన్, బడ్జెట్ రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, డీపీవో రమణామూర్తి, డీఆర్‌డీఏ అధికారిణి పద్మజారాణి పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

ఎన్ఎస్ఐసీలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

చర్లపల్లి, ఫిబ్రవరి 6 : ఎస్సీ, ఎస్టీ మహిళా, ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుందని ఎన్ఎస్ఐసీ సెంటర్ హెడ్ ఎన్‌కే.సుబ్రమణి అన్నారు. ఏఎస్‌రావు నగర్ డివిజన్ పరిధిలోని ఈసీఐఎల్ కమలానగర్‌లోని ఎన్ఎస్ఐసీలో మంగళవారం ఎన్ఎస్ఐసీ, ఎంఎస్ఎంఈ, నేషనల్ ఎస్సీ,ఎస్టీ హబ్, ఎమర్జింగ్ ఫెడరేషన్ ఆఫ్‌ఇండియా స్టార్టప్ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమర్జింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా స్టార్టప్ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ కేబీ.వెంకట్ మాట్లాడుతూ వ్యాపార రంగాల్లోకి రావాలనుకునే వారికి తమ సంస్థ సహకారం అందిస్తుందన్నారు.

ఎన్ఎస్ఎస్‌హెచ్ హెడ్ సురేశ్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ మహిళలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్) డీజీఎం డాక్టర్ జయేశ్‌కుమార్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) సీఎం ఏకే.రాజు, అధికారి వినోద్‌బాబు, జెమ్ ఫెసిలిటేటర్ రవివర్మ మహిళలకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. కార్యక్రమలో ఎన్ఎస్ఐసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ రవికర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెరువులో యువతి మృతదేహం లభ్యం

మేడ్చల్, ఫిబ్రవరి 6 : గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. డబిల్‌పూర్ గ్రామ చెరువులో మంగళవారం యువతి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి, మృతదేహాన్ని వెలికితీశారు. యువతి వయస్సు 30 నుంచి 35 ఏండ్లు ఉంటుంది. ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గుర్తు తెలియని మృతదేహంగా పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధుడు అదృశ్యం

మల్కాజిగిరి, ఫిబ్రవరి 6 : వృద్ధుడు అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పీఎస్ పరిధిలో జరిగింది. రాజా నగర్ కాలనీలో నివసిస్తున్న శంకరయ్య సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రి వరకూ రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ దొరక లేదు. భార్య సులోచన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

జవహర్‌నగర్, ఫిబ్రవరి 6 : మహిళ అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్‌హెచ్‌వో సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. కాప్రా మండలంలోని సాయిబాబానగర్‌లో రేఖ కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటున్నది. కాగా రేఖ ఈ నెల 6న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రింగురోడ్డుపై ఘోర ప్రమాదం

పల్టీలు కొట్టి.. ఇన్నోవాపై పడిన కారు ● ఇద్దరి మృతి

రెడ్డప్ప (ఫైల్)

రెడ్డి గణేశ్ (ఫైల్)

మేడ్చల్, ఫిబ్రవరి 6 : ఔటర్ రింగు రోడ్డుపై ఘోర ప్రమాదం జరిగింది. మితిమీరిన వేగంతో వెళ్తున్న కారు అదుపుతప్పి గాలిలో పల్టీలు కొట్టింది. డివైడర్ దాటి అటువైపు నుంచి వెళ్తున్న ఇన్నోవాపై పడింది. ఈ ఘటనలో ఎక్స్‌యూవీ కారులో ప్రయాణిస్తున్న విద్యార్థుల్లో ఒకరు, ఇన్నోవా కారులో ఉన్న మరొకరు మృతి చెందారు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. ఎస్సై నవీన్ రెడ్డి కథనం ప్రకారం.. కూకట్‌పల్లి నివాసి రెడ్డి గణేశ్ (18), మంగళపు గణేశ్, మోక్షిత్ రెడ్డి దుండిగల్‌లో ఉన్న ఎంఎల్ఆర్ఐటీలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నారు. సోమవారం ఇంట్లో నుంచి కారులో బయల్దేరారు. మధ్యాహ్నం కళాశాలకు వెళ్లి, మిడ్-2 పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష ముగిసిన అనంతరం జాలీగా రింగురోడ్డు ఎక్కారు. రాత్రి వరకు తిరిగి, 10 గంటల సమయంలో కూకట్‌పల్లికి తిరుగు పయనమయ్యారు. శామీర్‌పేట నుంచి కీసర వైపు విద్యార్థులు వేగంగా వాహనాన్ని నడుపుతూ వస్తున్నారు. వారు ఎగ్జిట్ 6 (మేడ్చల్) సమీపానికి చేరుకోగానే వాహనం అదుపుతప్పి.. గాలిలో పల్టీలు కొట్టింది. అదే సమయం వనస్థలిపురానికి చెందిన రెడ్డప్ప (50) బాచుపల్లిలో తన పని ముగించుకొని, తిరిగి రింగు రోడ్డు మీదుగా ఇన్నోవా కారులో వెళ్తున్నాడు. పల్టీలు కొడుతూ వచ్చిన విద్యార్థులు కారు రెడ్డప్ప ప్రయాణిస్తున్న కారుపై పడింది. ఆయన కారులో ఇరుక్కుపోయాడు. ఈ ఘటనలో రెడ్డప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థులను కొంపల్లిలో ఉన్న శ్రీకర హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న విద్యార్థుల్లో రెడ్డి గణేశ్ రాత్రి 12 గంటల తర్వాత మృతి చెందాడు. మిగితా వారి పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దశదిన కర్మ
చిరునవ్వుల పలకరింపుతో అందరి హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించిన మీరు ఆ భగవంతుని సన్నిధికి చేరినా...
మీ యొక్క తీపి జ్ఞాపకాలు ఎప్పటికీ మా మదిలోనే వుంటాయి. దైవసన్నిధిలో వున్న మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దైవాన్ని ప్రార్థిస్తూ...
శోకతప్త హృదయాలతో...
తెలంగాణ ఉద్యమకారులు మల్కా